క్లుప్తంగా

మీ సేవ కేంద్రం తనిఖీ



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు బస్టాండు సెంటరులోని మీ సేవ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో కె.శివపార్వతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయాంలోని సర్టిఫికెట్లు ఏమైనా ఉన్నాయా.. అని సోదాలు చేశారు. ప్రస్తుతం ఏ చిహ్నం ఉన్న సర్టిఫికెట్లపై ధ్రువీకరణ పత్రాలను ముద్రిస్తున్నారు.. వంటి వివరాలను మీసేవ నిర్వాహకుడు గోపిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ ప్రభుత్వ చిహ్నం ఉన్న సర్టిఫికెట్లపై మాత్రమే ధ్రువీకరణ పత్రాలను ముద్రించి ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ తదితరులున్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉదయ్‌కుమార్



ప్రత్తిపాడు: ఎన్‌సీసీతో విద్యార్థులు క్రమశిక్షణ గల పౌరులుగా తయారవుతారని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని కళాశాలలో బుధవారం తెనాలి 22 (ఏ) బెటాలియన్ అనుబంధంతో నూతన ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉదయ్‌కుమార్ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఎంపికైన క్యాడెట్స్‌కు ఎన్‌సీసీ లక్ష్యాలు, విధులు, క్రమశిక్షణ వంటివి వివరించారు. విద్యార్థి దశ నుంచే యువతలో దేశభక్తి, సమాజ సేవ పట్ల ఆకాంక్ష ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్ జె.కిశోర్ బాబు, ఎన్‌సీసీ కేర్ టేకర్ జె.ప్రవల్లిక, ఆయా విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై ప్రచార రథం ప్రారంభం



గుంటూరు రూరల్: మండలంలోని 11 గ్రామాల్లో డయేరియా, సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించామని.. ఈ ప్రచార రథం కరపత్రాలను పంపిణీ చేస్తు ప్రజలకు అవగాహన కల్పిస్తుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని లాలుపురం గ్రామంలో ప్రచార రథాన్ని జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు, సీఆర్పీలు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, లాలుపురం ఈవో సుభాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థి ప్రతిభ



గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థుల ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలతో సమాజ శ్రేయస్సుకు దోహదపడే వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడం కళాశాలకే గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. బుధవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఇటీవల విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 24 గంటల హ్యాకథాన్ పోటీల్లో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి జశ్వంత్ సాయి ప్రతిభ కనబరచి ద్వితీయ బహుమతిని అందుకున్నాడన్నారు. విద్యార్థికి నగదు బహుమతి, ప్రశంసా పత్రం లభించాయన్నారు. జాతీయ స్థాయిలో కళాశాల విద్యార్థుల ప్రతిభకు లభించిన గుర్తింపు, వారి సాంకేతిక విజ్ఞానానికి నిదర్శనమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ శ్రీనివాస్, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- అధ్వాన్నంగా మురుగు నీటి వ్యవస్థ
- రోజురోజుకు పెరుగుతున్న దోమలు ఉధృతి
- మొక్కుబడిగా ఫాగింగ్ నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



రవి కాలనీలో స్తంభించిన మురుగు పారుదల

పొన్నూరు: వర్షాల ప్రభావంతో ప్రధాన రోడ్లపై మురుగునీరు.. చెత్త చెదారాలతో నిండిన కూడళ్లు.. రోజుల తరబడి పారుదల లేక దుర్వాసనతో నిండిన డ్రెయిన్లు.. దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నివారణకు మున్సిపల్ యంత్రాంగం సరైన చర్యలు చేపట్టకపోవడం, అధ్వానంగా ఉన్న మురుగు వ్యవస్థ.. ఇలా పలు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు.

పట్టణంలో 31 వార్డులు

పట్టణ పరిధిలో 31 వార్డులు ఉన్నాయి. సుమారు 70 వేల మంది జీవనం సాగిస్తున్నారు. దోమల వ్యాప్తి రోజురోజుకూ అధికమవుతోంది. పురపాలక సంఘం ఫాగింగ్ చేసేందుకు ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా దోమల ఉధృతి మాత్రం తగ్గడం లేదు. ప్రధాన సెంటర్లకే ఫాగింగ్ పరిమితమైందనే విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోని పలు వార్డులలో మురుగు నీటి పారుదల లేక అధ్వానంగా తయారయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బారిన పడి జ్వరాలు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

- దోమల ఉధృతిని పట్టించుకోకుండా అధికారులు దోమలపై యుద్ధం అంటూ కార్యక్రమాలు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దోమల నివారణ దినోత్సవం నిర్వహించి, దోమల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞలు చేయించిన అధికారులు వాటి నియంత్రణను పట్టించుకోవడం లేదని ప్రజలు మండి పడుతున్నారు.



అంబేడ్కర్ నగర్లో అధ్వానంగా మురుగు వ్యవస్థ

- వర్షాలతో పట్టణంలో పలు ప్రాంతాల్లో రోడ్లపై, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దోమలు నివారణకు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫాగింగ్ చేయడం లేదు

ప్రస్తుతం దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నా, ఫాగింగ్ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి.

– గేరా సంజీవ్, పాత పొన్నూరు

భక్తిశ్రద్ధలతో దసరా నవరాత్రి వేడుకలు



నంబూరులో దసరా నవరాత్రి పూజల్లో అంబటి మురళీకృష్ణ, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పెదకాకాని: దసరా నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పెదకాకాని మండలం నంబూరు నాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పందిరిలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం రాత్రి జరిగిన పూజల్లో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. స్థానిక నాయకులు అతిథులకు సాదర స్వాగతం పలికారు. అర్చకులు అంబటి మురళీకృష్ణ, పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల చేతుల మీదుగా పూజలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజ కార్యక్రమాల్లో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వుయ్యూరు సతీష్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి, మందాళ శివారెడ్డి, భీమవరపు సతీష్‌రెడ్డి, బొంతు శివశంకరరెడ్డి(శివ), 4వ వార్డు సభ్యుడు తియ్యగూర శివకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలి

కిట్స్ అక్షర్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రత్తిపాడు: ఇంజనీరింగ్ విద్యతో పాటు ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఇండస్ట్రీలకు కావలసిన కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని కిట్స్ అక్షర్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదలలోని కిట్స్ అక్షర్ కళాశాలలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదివే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య సోదరభావం ఉండాలని, సీనియర్లు, జూనియర్లు స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలన్నారు. డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య మాట్లాడతూ ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా ఉంచేందుకు విద్యార్థులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదకాకాని: అగతవరప్పాడు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సంవత్సరం నుంచి సబ్బులు, నూనె, యూనిఫామ్, గ్లౌజులు, మాస్కులు ఇవ్వలేదని వెంటనే సబ్బులు, నూనె తదితరాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలన్నారు. ''పంచాయతీ కార్యదర్శి పి.మీనాక్షి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాజారమేష్, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాబు, జె.కామేశ్వరరావు, జి.రత్నకుమారి, కె.కీర్తి, టి.ధర్మరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు శివాలయంలో అన్నపూర్ణ దేవిగా...



వేణుగోపాలస్వామి దేవాలయంలో...



పొన్నూరు వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో...



పొన్నూరు తెలగపాలెం కోదండరామాలయంలో...



చేబ్రోలు మండలం నారాకోడూరులో...

అన్నపూర్ణగా ఆదిపరాశక్తి



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో...

ప్రత్తిపాడు/పొన్నూరు: దేవి శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు వివిధ అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో దేవి శరన్నవరత్రి ఉత్సవాలలో భాగంగా నారాకోడూరులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, మంచాల గ్రామంలోని ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారు గాయిత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భారతి

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండల పరిధిలోని యనమదల పుట్లలమ్మ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు పట్టించడం వలన తల్లీబిడ్డకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కచ్చితంగా బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పసికందుకు తాగించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గొట్టిపాడు సెక్టారులోని పాతమల్లాయపాలెంలో పోషణ్ మాసోత్సవం, స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారితో పోషకాహార ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసు పద్మావతి, గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి, ఏఎన్‌ఎంలు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్



మాట్లాడుతున్న డాక్టర్ మేరీ యునిస్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రత్తిపాడు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్ అన్నారు. పెదగొట్టిపాడు పీహెచ్‌సీలో బుధవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కిశోర బాలికలకు పోషకాహారం, యుక్త వయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరీ యునిస్ మాట్లాడుతూ మహిళలు చిన్న చిన్న అనారోగ్య సమస్యల పట్ల అలసత్వం వహిస్తే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియరాణి, ఎంపీటీసీ సభ్యురాలు సామ్రాజ్యం, ఎంపీహెచ్‌ఎస్‌లు మల్లిఖార్జునరావు, విజయకుమారి ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్‌ఎన్ నిర్మల, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కుర్నూతలలో వైద్య శిబిరం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో బుధవారం స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, ప్రజలందరికీ పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు, డాక్టర్ అష్రఫ్ తజిన్, వైద్య సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



చేబ్రోలులో సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

చేబ్రోలు: విద్యార్థులు చదువుతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే సుచరిత అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో బుధవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యత, గొప్పతనం గురించి అధ్యాపకులు వివరించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా పథకంలో భాగస్వాములై సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఫ్లెక్సీలు, ప్లకార్డులతో ప్రదర్శనగా ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో బాధ్యత చాలా గొప్పది



మాట్లాడుతున్న ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య దివ్య తేజోమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ వలంటీర్ల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ప్రత్యేక అతిథి జే రంగారావు మాట్లాడుతూ మానవ జీవితంలో బాధ్యత చాలా గొప్పదని, ప్రతి ఒక్కరూ సహాయం అందించే వారిగా ఉండాలని, ఆశించే వారిగా కాదన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో విద్యతో పాటు సామాజికతను పెంపొందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వలంటీర్లకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య శివరామ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య, ఆచార్య పాల్ కుమార్, ఆచార్య లింగరాజు, ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య ప్రమీలరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సునీత, డాక్టర్ సుజనా, డాక్టర్ రాధిక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ సూర్యనారాయణ, ఆచార్య నిరుపమ, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.





వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పొన్నూరు, ప్రత్తిపాడు సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

పీఎం స్వానిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: వీధి వ్యాపారులు పీఎం స్వానిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో లోక కల్యాణ మేళా నిర్వహించారు. సభలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యాలయంలో జరిగే మేళాలో కొత్తగా వీధి వ్యాపారులు పేర్లు నమోదు చేసుకుని ఐడీ కార్డు పొందితే, వారికి లోన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. పీఎం స్వానిధి లోన్లు రీ పేమెంటుపై బ్యాంకర్లు వివరించారు. వీధి విక్రయదారులకు సంబంధించిన పథకాలను కార్మిక శాఖ అధికారులు తెలిపారు. మెప్మా కార్యాలయంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్ ఉమామహేశ్వరి, కార్మిక సహాయ అధికారి కె.అనిత, మెప్మా డీపీఎంయూ ఎల్‌హెచ్ జయకుమార్, సీఎంఎం శ్యామల, సీవో, ఆర్పీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అగ్రిసెట్‌లో అగ్రికల్చర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రత్తిపాడు: అగ్రిసెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించినట్లు బీఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.అమృత గాయత్రి తెలిపారు. అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశాల కోసం ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఇటీవల అగ్రిసెట్ పరీక్షలు నిర్వహించింది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రత్తిపాడు మండలం యనమదల బీఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలకు చెందిన నేలపాటి స్వాతి 45వ ర్యాంకు, ఫిరంగి అభిలాష్ 127, గళ్ళ గోపీచంద్ 136, ఈదర నందుశ్రీ 181వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాసరావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ అమృత గాయత్రి, కోర్సు ఇన్‌చార్జ్ సయ్యద్ హమద్ బాషాలు విద్యార్థులను అభినందించారు.